క్లుప్తంగా

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

శాయంపేట : ఈనెల 8వ తేదీన పరకాల కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీఐ రంజిత్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో రాజీపడేవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆక్సిడెంట్, కొట్టుకున్న, తిట్టుకున్న, చీటింగ్, భూమి తగాదాల కేసులో రాజీపడాల్సిన వారు ఈనెల 8వ తేదీన పరకాల కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు కోర్టుకు హాజరై రాజీపడాలని పిలుపునిచ్చారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



శాయంపేట : మండలంలోని సూర్యానాయక్ తండా గ్రామంలో గల గుడుంబా స్థావరాలపై బుధవారం పరకాల ఎక్సైజ్‌శాఖ సీఐ తాతజీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 700లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి, సిబ్బంది ప్రశాంత్, వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు : మండల కేంద్రంతోపాటు వెంకటాపూర్, కొండపర్తి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్టు కొమ్మల తొలగింపు, 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పద్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఐనవోలులో వ్యవసాయ బావులు, ముల్కలగూడెం, నర్సింహులగూడెం, నాగపురం గృహ అవసరాలు, వ్యవసాయ బావులకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆత్మగౌరవ కవాతుకు తరలిరావాలి



దామెర : జూలై 7వ తేదీన వరంగల్ నగరంలో నిర్వహించతపెట్టిన మాదిగల ఆత్మగౌరవ కవాతుకు మండలంలోని ప్రతి మాదిగబిడ్డ తరలిరావాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో మండల ఇన్‌చార్జ్ గోవిందు సుకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఉద్యమ ఫలితంగా మాదిగలు నేడు సమాజంలో ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని అన్నారు. ఎమ్మార్పీఎస్ 30ఏళ్ల పోరాటంలో సమాజంలో అన్ని వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందాయని, మంద కృష్ణ మాదిగ నిర్వహించిన విశ్వరూప మహాసభను చూపి ప్రధాని నరేంద్ర మోదీ ఎస్సీ వర్గీకరణ చేస్తానని మాట ఇవ్వడం జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రానున్నందని, నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మాదిగలకు ఇచ్చిన హామీని అమలు చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. మాదిగల ఆత్మగౌరవ కవాతు కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పరిమళపాల్, గోవిందు కర్ణాకర్, అభిలాష్, రాజు, మహేష్, టిల్లు, కొమురయ్య పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

ఖానాపురం : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ నుంచి ఆయా ప్రభుత్వ పాఠశాలలకు ఎంఈఓ రత్నమాల బుధవారం పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సుధాకర్, ఎమ్మార్సీ సిబ్బంది శశిధర్, రాజేందర్, రజినితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండలంలోని జల్లీ గ్రామానికి చెందిన సింగారపు ప్రదీప్ తండ్రి ఎలీషా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అదే గ్రామానికి చెందిన గణపతి యూత్ సభ్యులు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు ఇండ్ల సునీల్, ఉపాధ్యక్షుడు తండ రమేష్, సభ్యులు మెండే విజేందర్, వంగపండ్ల పెద్ద రాజు, జంపాల వీరన్న, పోలిశెట్టి సతీష్, నూనె శ్రీనాథ్, పిల్లల వీరన్న, కాసాని రమేష్, ఇరుకుల రవి, తదితరులు ఉన్నారు.

టార్గెట్ లక్ష మొక్కలు..

- హరితహారానికి అంతా సిద్ధం
- అందుబాటులో వివిధ రకాల మొక్కలు
- 15 నుంచి ప్రారంభం
- సిబ్బందికి పలు సూచనలు



శంభునిపల్లి నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

కమలాపూర్ : 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమానికి అంతా సిద్ధమైంది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు కమలాపూర్ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండల వ్యాప్తంగా లక్ష మొక్కలు నాటాలనే లక్ష్యంతో మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపట్టారు.

అందుబాటులో పలు రకాల మొక్కలు..

మండలంలోని 23 గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను పెంచారు. ఇళ్లల్లో పెంచేందుకు జామ, నిమ్మ, దానిమ్మ, అల్లనేరేడు, బొప్పాయి, సీతాఫలం, మునగ, మల్లె, గులాబీ, చామంతి, మందార, గోరింట, కనకాంబరం, వెలగ, కానుగ, అడవి తంగేడు, కరివేప, మారేడు, రావి, గన్నేరు, నాలుగు రకాల క్రోటాన్స్, అశ్వగంధ, రణపాల, గుల్‌మొహర్, టికోమా, వేప, చింత వంటి పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలు అందుబాటులో ఉన్నాయి. మామిడి, కొబ్బరి, బత్తాయి, డ్రాగన్ ఫ్రూట్, టేకు, ఈత, తాటి, మల్బరీ, ఆయిల్ పామ్ తోటల పెంపకానికి రైతుల కోసం (వందకు పైగా మొక్కలు నాటుకుంటే వాటి సంరక్షణ కోసం) మూడేళ్ల పాటు నెలకు ఒక్కో మొక్కకు రూ.5 నుంచి రూ.15 వరకు, మునగ, యూకలిప్టస్ మొక్కల పెంపకానికి ఏడాది పాటు రూ.3 చొప్పున ఈజీఎస్ ద్వారా చెల్లిస్తారు.

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం..

హరితహారం కార్యక్రమం మండలంలో పూర్తిస్థాయిలో నెరవేరడం లేదు. ప్రతి ఏడాది నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలైతే నాటుతున్నారు. కాకపోతే ఆ మొక్కలను విద్యుత్ తీగల కింద నాటడంతో ప్రస్తుతం మొక్కలు కాస్తా చెట్లుగా ఎదిగి విద్యుత్ తీగలకు తగులుతుండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది తీగల కింద ఉన్న చెట్లను, చెట్ల కొమ్మలను నరికి వేస్తున్నారు. అలా కాకుండా ఈ సారి నాటే మొక్కలను భవిష్యత్‌లో నరికి వేసే అవసరం రాకుండా ఉండేలా విద్యుత్ తీగలకు దూరంగా నాటాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

15 నుంచి మొక్కలు నాటే కార్యక్రమం..

3మండలంలోని నర్సరీల్లో పెంచిన మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు పడగానే తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 నుంచి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రోడ్లకిరువైపులా, చెరువు గట్లు, శిఖం భూముల్లో మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇళ్లల్లో పెంపకానికి అవసరమైన పలు రకాల పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలు నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల వారు మొక్కల కోసం ఎంపీడీఓ కార్యాలయంలో, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. హరితహారాన్ని సక్సెస్ చేసేందుకు సిద్ధంగా ఉండాలంటున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది చిన్న జీపీల్లో 3 వేలు, పెద్ద జీపీల్లో 5 వేలకు తగ్గకుండా మండల వ్యాప్తంగా లక్ష మొక్కలు నాటాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకు అనుగుణంగా వర్షాలు ప్రారంభం కాగానే గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యుత్ తీగల కింద కాకుండా ప్రతి గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటు చేయాలని, నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటి సంరక్షించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకుంటున్నాం. సిబ్బందికి సూచనలు ఇస్తున్నాం.

\- గుండె బాబు, ఎంపీడీఓ

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు

ఎల్కతుర్తి : ఎండ తీవ్రత వలన వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భీమదేవరపల్లి మండలం వంగర పీహెచ్‌సీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో పీహెచ్‌సీ డాక్టర్ రెహమాన్ బుధవారం మహిళలకు అవగాహన కల్పించారు. ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో వడదెబ్బకు గురైనప్పుడు శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరుగడం, తలనొప్పి, నాలుక ఎండిపోవడం, శరీరంలో నీటిశాతం కోల్పోవడం, మూత్రం పసుపు రంగుతో పాటు మంట రావడం, పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లే లక్షణాలు కనిపిస్తాయన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని నీడ ప్రదేశానికి తీసుకెళ్లి శరీరాన్ని చల్లటి నీటితో తుడవాలన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరినీరు, ఓఆర్ఎస్ కలిపిన ద్రావణాన్ని తాగించాలన్నారు. అవసరమైతే 108 ద్వారా దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో, సబ్‌సెంటర్లలో ఏఎన్ఎమ్, ఆశా కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్, కెఎల్ఎన్ స్వామి, స్వరూప, ఏఎన్ఎంలు పద్మ, విజయ, శోభ, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలి

- ఏపీఎం శ్రీధర్‌రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం

శాయంపేట : మండలంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీధర్ రెడ్డి సూచించారు. మండలంలోని పత్తిపాక గ్రామంలో గల బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి అయ్యాయని, వర్షం కారణంగా శాయంపేట మండలంలో అలస్యమైనట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబోసి మ్యాచర్ శాతం తక్కువ ఉండేలా చూడాలని రైతులకు సూచించారు. పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోనే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభిస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. రైతులు సమ్యమనం పాటించాలని, కొనుగోలు విషయంతో జాగ్రత్తలు పాటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ విజయ్‌కుమార్, ఏఈఓ అర్చన, రైతులు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి



నల్లాలను పరిశీలిస్తున్న బాలకృష్ణ

చెన్నారావుపేట : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ అన్నారు. ఈ మేరకు మండలంలోని జల్లీ హైస్కూల్, శంకరం తండా ప్రాథమిక పాఠశాల, లింగగిరి, బీసీ కాలనీ, తోపనగడ్డ తండా, నాయిక పోడు కాలనీ, చంద్రుతండా, ఎస్సీ కాలనీ, జీడిగడ్డ తండా, బాపునగర్ పాఠశాలలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అమ్మ ఆదర్శ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి, కిచెన్ షెడ్, వాష్ బేసిన్ పనులు, విద్యుత్‌పనులలో పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందరావు, మండల నోడల్ ఆఫీసర్ బి.సరళ, డీఈ రాజశేఖర్, నరేష్, హెచ్‌ఎంలు కట్టస్వామి, మహేందర్, భాస్కర్, శౌరీ, అనిల్, శ్రీనివాస్, రవి, భద్రు, పంచాయతీ కార్యదర్శులు మాలతీ, శ్రీనాథ్, సీఆర్‌పీ సంపత్, వీవోలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



నర్సంపేట : విజయోత్సవ సంబురాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నర్సంపేట : కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అత్యధిక పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకోవడం, తెలంగాణలో బీజేపీ 8 పార్లమెంట్ స్థానాలను గెలుచుకోవడంతో నర్సంపేట పట్టణంలో బీజేపీ నాయకులు బుధవారం టపాసులు కాల్చి విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ ప్రభారి అజ్మీరా కృష్ణవేణి, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, మహబూబాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, కౌన్సిలర్లు జుర్రు రాజుయాదవ్, లూనావత్ కవిత వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి



చెన్నారావుపేట: నినాదాలు చేస్తున్న నాయకులు

చెన్నారావుపేట : నరేంద్ర మోదీతోనే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా కార్యదర్శి సంగెం శంకర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఉప్పరపల్లిలో బుధవారం మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయబోతుండటంతో టపాసులు పేల్చి బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నాయకులు విజయ్‌కుమార్ రెడ్డి, ధర్మ, రాజు, సుమన్, హరిష్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఆత్మకూరు : మొక్క నాటుతున్న ఎంపీడీఓ



పరకాల : కూలీలతో ఎంపీడీఓ ఆంజనేయులు



కమలాపూర్ : మొక్క నాటుతున్న నాయకులు

ఆత్మకూరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం పర్యావరణ పరిరక్షణకై ప్రతిజ్ఞ చేశారు. అలాగే గ్రామాల్లో మొక్కలు నాటారు. మండల కేంద్రంలో మా స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో ప్రజలకు ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయే తరాలకు చక్కటి పర్యావరణాన్ని అందించేందుకు మొక్కలు నాటడమే మార్గమని అన్నారు. ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, మాజీ సర్పంచ్ రాజు, సొసైటీ డైరెక్టర్ జయపాల్‌రెడ్డి, మా స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఎస్.శివప్రసాద్, పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో గల గ్రామపరిపాలన అధికారులు, గ్రామస్తులతో కలిసి మొక్కల సరంక్షణపై ప్రతిజ్ఞ చేశారు. మల్లక్కపేట గ్రామపంచాయతీ అమృత్ సరోవర్ వద్ద మొక్కలు నాటారు. వెల్లంపల్లి అమృత్ సరోవర్ వద్ద ఎంపీఓ ఇమ్మడి భాస్కర్, నాగారంలో ఏపీఓ ఇందిర, లక్ష్మీపూర్‌లో ఏపీఎం క్రాంతి, పైడిపల్లిలో ఈసీ రజనీకాంత్ కూలీలు, గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం వద్ద అంబేడ్కర్‌వాదులు బుధవారం మొక్కలు నాటే నాటారు. ఈ సందర్భంగా పుల్ల శంకర్ మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు మొక్కలు ఎంతగానో తోడ్పడుతాయని, మొక్కల పెంపకం ద్వారా సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండుతాయని, పర్యావరణ, కాలుష్య నివారణకు మొక్కలు దోహదపడుతాయన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా తమ ఇళ్లల్లో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అంబేడ్కర్ వాదులు పుల్ల శ్రీనివాస్, శోభన్‌బాబు, శ్రీధర్, రాజేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల శివారులో గల గట్టుమల్లికార్జున స్వామి హుండీని ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. హుండీలు, వివిధ టికెట్లు ద్వారా 30 రోజుల కాలానికి రూ.1లక్ష 6 వేల 932 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. దేవదాయ ధర్మాదాయశాఖ డివిజన్ పరిశీలకుడు సంజీవరెడ్డి, పూజారులు వినయ్ శర్మ పాల్గొన్నారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు



సమావేశంలో మాట్లాడుతున్న రాకేశ్

శాయంపేట : అధికారం ఎవరికీ శాశ్వతం కాదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా యూత్ నాయకుడు బేరుగు రాకేశ్ అన్నారు. మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ పుంజుకుని ఉవ్వెత్తున లేస్తుందన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, గెలిచినా, ఓడినా ప్రజల్లోనే ఉంటామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమాలు, పోరాటాలు కొత్త కాదని, దశాబ్ద కాలంగా పోరాడిన చరిత్ర కేసీఆర్‌కు ఉందన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎన్నికల ముందు శాయంపేట మండలానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలానికి అంబులెన్స్ ఏర్పాటు కోసం రూ.30లక్షల కేటాయించామని ఆరు నెలల నుంచి చెబుతున్నా అంబులెన్స్ కనిపించడం లేదని విమర్శించారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఆధ్వర్యంలో మండలంలోని సమస్యలపై, హామీల అమలుపై పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు



కమలాపూర్ : ఉప్పల్ నుంచి భీంపల్లి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్లకొమ్మలు, ముళ్లపొదలను స్థానిక పోలీసులు బుధవారం తొలగించారు. ఉప్పల్-భీంపల్లి మార్గంలో రోడ్డు పక్కన చెట్లు, ముళ్లపొదలు పెరగడంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండగా ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ జేసీబీ సాయంతో తొలగింపజేశారు. కానిస్టేబుల్ సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ ఆర్థిక సాధికారతకు ఉద్యమిద్దాం



సదస్సులో మాట్లాడుతున్న జ్యోతి

న్యూశాయంపేట : మహిళా సమాఖ్య ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో మహిళా, రాజకీయ, ఆర్థిక సాధికారతకై ఉద్యమించాలని భారత మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.జ్యోతి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో మంచాల రమాదేవి అధ్యక్షతన జరిగిన భారత మహిళా సమాఖ్య 70వ ఆవిర్భావ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల హక్కుల సాధనకై నిరంతరం ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హక్కుల సాధనకు మహిళలందరూ తమతో కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.లలిత, తిరుమల, అమీనా, పుష్ప, లత, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో రెజోనెన్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రాజిరెడ్డి, డైరెక్టర్లు

హన్మకొండ: నీట్ ఫలితాల్లో హనుమకొండలోని రెజోనెన్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించారని రెజోనెన్స్ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. తమ కళాశాలకు చెందిన సీహెచ్.ప్రజ్వల 720 మార్కులకు గాను 665 మార్కులు సాధించారని, కె.ఆకాంక్ష 651, సి.హెచ్.సాయి 644, బి.నర్సింహారెడ్డి 631, జి.సాయి పవన్ 617, బి.నక్షత్ర 600 మార్కులు సాధించారని వివరించారు. 26 మందికి 500లకు పైగా మార్కులు సాధించారని తెలిపారు. వీరికి వైద్య విద్యలో ఉచిత ప్రవేశాలు సాధించనున్నారన్నారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబరించిన విద్యార్థులను చైర్మన్, డైరక్టర్లు అభినందించారు. కార్యక్రమంలో డైరక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సీఏఓ లెక్కల రమ్య పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో చండీహోమం



శ్వేతార్క ఆలయంలో చండీహోమం జరిపిస్తున్న అర్చకులు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్రీశ్వేతార్క మూల గణపతి దివ్య క్షేత్రంలో బుధవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో హోమం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. చండీహోమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయంలో పండుగ వాతావరణంలో నెలకొంది. ఈ హోమంలో బ్రహ్మశ్రీ ప్రశాంత్ శర్మ, రోహిత్ ఉపాధ్యాయ, డాక్టర్ కుమారస్వామి, సీనమ్మ, మణిదీప్, రవి, సుధీర్‌తో పాటు భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బాలవికాస సేవలు అభినందనీయం



నర్సంపేట రూరల్ : బాలవికాస సేవలు అభినందనీయమని నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి, బాలవికాస ప్రతినిధి సంపత్ అన్నారు. నర్సంపేట మండలంలోని రామవరం గ్రామంలో వాటర్‌ప్లాంట్ వార్షిక మహాసభ బుధవారం ప్లాంట్ అధ్యక్షుడు జినుకల రజనీకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో గ్రామాల్లో బాల వికాస వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తుందని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జినుకల నర్సింహారాములు, ఉపాధ్యక్షుడిగా జినుకుల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా జినుకుల రజనీకుమార్, సహాయ కార్యదర్శిగా జినుకల అశోక్, కమిటీ సభ్యులుగా జినుకల రాంబాబు, విజేందర్, దండు రమాదేవి, కొడారి ప్రసన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.